క్లుప్తంగా

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనమాల



వనమాల శ్రీనును సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరసాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, వన్నెకుల క్షత్రియ సంక్షమ సంఘం రాష్ట అధ్యక్షుడు వనమాల శ్రీనివాస్‌ను తిరిగి రెండోరి ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను గురువారం పలవురు బీసీసంఘ నాయకులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతానని చెప్పారు. శ్రీనివాస్‌ను సత్కరించిన వారిలో బీసీ సంఘ నాయకులు సందక రామకృష్ణ, మాకా శంకర్, కోలా కనకరాజు, కట్టుంగ నరేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెనుగొండ: పెనుగొండ మండల రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దారు జి.అనితకుమారి గురువారం విలేకరులకు తెలిపారు. 6న దొంగరావిపాలెం, 10న చినమల్లం, 11న దేవ, 12న ములపర్రు 13న రామన్నపాలెం, 17న కొఠాలపర్రు, 18న వెంకట్రామపురం, మునమర్రుల్లోనూ, 19న ఇలపర్రులోనూ, 20న నడిపూడిలోనూ, 27న వడలి లోనూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు సదస్సులు ప్రారంభమవుతాయన్నారు. భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 6 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలు, రీ–సర్వే సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత వ్యక్తులు దరఖాస్తులు అందజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. శుక్రవారం కొత్తపాలెం, శేరేపాలెం, 10న మొగల్తూరు, 11న రామన్నపాలెం, 12న ముత్యాలపల్లి, 13న కొత్తోట, మోడి, 17న పేరుపాలెం సౌత్, నార్త్, 18న కేపీపాలెం సౌత్, నార్త్, 19న కాళీపట్నం తూర్పు, పడమర, 20న పాతపాడు, జగన్నాథపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

చాంబర్స్ కళాశాలలకు ఎన్‌సీసీ నావెల్ యూనిట్ మంజూరు



సంజిత్ రౌత్రాయ్‌ను సత్కరిస్తున్న కారుమూరి వెంకట నరసింహారావు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని స్థానిక బీఆర్ ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలకు ఎన్‌సీసీ నావెల్ యూనిట్ మంజూరు చేసినట్లు నరసాపురం వైఎన్ కళాశాల 7 ఏ నావెల్ యూనిట్ ఇన్‌చార్జ్ కమాండ్ ఆఫీసర్ సంజిత్ రౌత్రాయ్ వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంజిత్ రౌత్రాయ్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల్లో, ఉన్నత చదువుల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఛాంబర్స్ విద్యాసంస్థలకు సీనియర్ డివిజన్ యూనిట్ అనుమతించారని, వచ్చే విద్యా సంవత్సరంలో మరో డివిజన్ అనుమతి రావడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీడీ నాగబాబు, పంకజ్‌శర్మ, దుర్గారావు, రాము, కళాశాల అకాడమిక్ అడ్వైజర్ ఎస్.సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ సర్టిఫికేషన్ కోర్సు హెడ్‌గా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఏపీ ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేషన్ కోర్సు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల హెడ్‌గా పాలకొల్లు మండలం దిగమర్రుకి చెందిన గుడిమెట్ల వెంకటేశ్వరరావుని నియమించారు. ఈ మేరకు ఎన్జీవో సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట నోడల్ ఆఫీసర్స్ మోహనరావు, సింధు చేతుల మీదుగా ఈ నియామక పత్రం అందుకున్నారు. ప్రతి వ్యాపార సంస్థకి ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. గ్రామ, పట్టణ, మండల, జిల్లా స్థాయిల్లో వ్యాపారస్తులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆహార కల్తీ నిరోధక చట్టంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తామని వెంకటేశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపారు.

ఊపందుకుంటున్న మాంసం విక్రయాలు

- కార్తీక మాసం ముగియడంతో పెరిగిన డిమాండ్
- ధరలు పెరుగుతాయంటున్న వ్యాపారులు



విక్రయానికి సిద్ధం చేసిన కోళ్లు

యలమంచిలి: కార్తీక మాసం ప్రభావంతో పడిపోయిన మాంసాహార అమ్మకాలు మళ్లీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. కార్తీకమాసం ముందు కిలో రూ.250 వరకు ఉన్న చికెన్ ధర కార్తీక మాసంలో ప్రభావంతో కిలో రూ. 180కి పడిపోయింది. చికెన్ తో పాటు చేపలు ధర కూడా పడిపోయింది. ఇతర మాంసాహార ఉత్పత్తుల అమ్మకాలు కూడా తగ్గాయి. కార్తీకమాసం పూర్తవ్వడంతో మళ్లీ మాంసాహార ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 450 దాకా కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో సుమారు 40 లక్షల పైగా కోళ్ల పెంపకాలు జరుగుతాయి. రోజుకు సుమారు 20 లక్షల కేజీలు వినియోగం ఉంటుంది. ఆదివారం ఇతర పండుగ దినాల్లో కూడా అమ్మకాలు బాగా ఉంటాయి.

కార్తీకంలో నష్టమే

ప్రస్తుతం చలి ప్రభావానికి కోళ్ల మరణాలు పెరగడంతో నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. కిలో కోడి సిద్ధం కావడానికి సుమారు రూ.100కు పైగా ఖర్చు అవుతుందని, అయితే కార్తీకమాసం ప్రభావంతో అమాంతంగా తగ్గిపోయిన చికెన్ ధరలతో నష్టాలు చవిచూస్తున్నామని పెంపెకందారులతో పాటు అమ్మకందారులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాదీ మూడు నెలలు అంటే కార్తీకమాసం, అయ్యప్ప, భవానీ, వేంకటేశ్వర స్వామి, శివమాలధారులు, ఇతర పూజల కారణంగా చికెన్, చేపలు, మటన్‌లను డిమాండ్ తగ్గిపోతుంది. ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ధరలపై తీవ్ర ప్రభావం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల నుంచి మాంసం, చికెన్ వ్యాపారాలు క్రమంగా పెరుగుతాయని పేర్కొంటున్నారు. గత రెండు నెలలు చికెన్ ధరలు, అమ్మకాలు తగ్గిపోతాయని చెబుతున్నారు. క్రిస్మస్ సమయంలో కొంత మేర అమ్మకాలు పెరుగుతాయన్నారు.

కిలో చికెన్‌కు కిలో ఉల్లిపాయలు ఫ్రీ



చికెన్ ధరలు తగ్గిపోవడంతో రెండు నెలలుగా వ్యాపారం సరిగ్గా లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో గత నెలలో కిలో చికెన్‌కు కిలో ఉల్లిపాయలు ఉచితంగా ఇచ్చాం. అలా ఇచ్చిన రోజుకు 25 నుంచి 30 కిలోల వ్యాపారం జరిగింది. కార్తీక మాసం పూర్తవ్వడంతో ఇప్పుడు రోజుకు 50 నుంచి 60 కిలోలు అమ్ముతున్నాం. అప్పుడప్పుడు చికెన్ మిగిలిపోవడంతో హోటల్స్, చికెన్ పకోడి బండ్ల వారికి తక్కువ ధరలకే ఇచ్చి కొంతమేర నష్టాన్ని తగ్గించుకుంటాం. పని వారికి వేతనాలు, ఖర్చులు వల్ల ఈ మూడు నెలలు కొంత నష్టం భరించాల్సి ఉంటుంది.

– బండి పెద్దిరాజు, చికెన్ విక్రయదారుడు

లైబ్రరీకి పుస్తకాల బహూకరణ



పుస్తకాలు బహూకరిస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం శాఖా గ్రంథాలయానికి హైదరాబాద్ పీవీఎస్ఆర్‌టీవీ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెచ్చేటి దేవేంద్రరావు రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను కుటుంబ సభ్యుల ద్వారా గురువారం జరిగిన కార్యక్రమంలో బహూకరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కేజీఎల్ఎల్ కుమారి మాట్లాడుతూ గ్రూప్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం దేవేంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకట్, హరిబాబు, సతీష్, సంధ్య, జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవా కార్యకర్తల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో న్యాయసేవా కార్యర్తలుగా పనిచేసే ఆసక్తి ఉన్న ఔత్సాహికుల నుంచి శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి కనీస విద్యార్హత, ఎలాంటి ధనార్జన ఆశించకుండా ఉండేవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొారు. విశ్రాంత ఉద్యోగులు, లా విద్యార్థులు, వైద్యులు, డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, రాజకీయేతర సభ్యులు దరాఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల వారు ఈ నెల 11వతేదీలోపు నరసాపురం కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్లవానిగరువులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ఇన్‌చార్జ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ కమిటీల నాయకులు విధిగా పాల్గొనాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన పేదల ఇళ్ల నిర్మాణం



మధ్యలో నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పెనుమంట్ర: పేదల ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం పెనుమంట్ర మండలం పాలమూరు లే–అవుట్లను ఆమె పరిశీలించి, ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని గృహాలు పూర్తయ్యాయి? గృహప్రవేశాలు జరిగాయని, మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి నిరుపేద కుటుంబాలకు అందించి, వారితో గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జ్ పీడీ జి.పిచ్చయ్యను జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. పెనుమంట్ర భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన 109 పోలింగ్ కేంద్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నిధులు కొరతతో నిర్మాణం నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. భవనం పూర్తిచేయడానికి పూర్తి అంచనాలను సిద్ధంచేసి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవై రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం



నరసాపురం: స్టీమర్‌రోడ్డు పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు

నరసాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సంబంధించి గురువారం జరిగిన పోలింగ్ నరసాపురంలో ప్రశాంతంగా సాగింది. దాదాపు 94.35 శాతం ఓటింగ్ నమోదైంది. స్టీమర్‌రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచి ఓటింగ్ జోరుగా సాగింది. పోలింగ్ స్టేషన్ పరిధిలో మొత్తం 425 ఓట్లు ఉండగా 401 ఓట్లు పోలయ్యాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

మొగల్తూరులో...

మొగల్తూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు 79 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి కె.రాజకిశోర్ తెలిపారు. మొగల్తూరు మండలంలోని 68 ఓటర్లకు గాను 21 మంది మహిళా ఓటర్లు, 67 మంది పురుష ఉపాధ్యాయ ఓటర్లుకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలో 116వ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు మహిళలు 17 మంది, పురుష ఉపాధ్యాయ ఓటర్లు 53 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. ఆర్డీఓ దాసి రాజు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ త్రిశూల పాణి, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ తదితరులున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, పోడూరు, ఆచంట, పెనుమంట్ర మండలాల్లో ఉదయం నుంచి మందకోడిగా ప్రారంభమైన ఎన్నిక సాయంత్రానికి భారీగా ఓటింగ్ నమోదైంది. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 63 ఓట్లుకు గాను 62, పెనుగొండ మండలంలో 156 ఓట్లుకు గాను 148 ఓట్లు, పోడూరు మండలంలో 71 మందికి గాను 68 ఓట్లు, పెనుమంట్ర మండలంలో 85 మందికి గాను 79 ఓట్లు పోలయ్యాయి. పెనుగొండ మండలం ఎంపీడీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రాన్ని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. పోలింగ్ అనంతరం ఆయా మండలాల్లోని పోలింగ్ బాక్సులను భీమవరం కలెక్టరేట్‌కు తరలించారు. మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి తహసీల్దార్లు కనకరాజు, అనిత కుమారి, ఫాజిల్‌లు ఎప్పటికపుడు పర్యవేక్షించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన పోలింగ్ పాలకొల్లు పట్టణంలో గురువారం ప్రశాంతంగా జరిగింది. బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో బూత్‌లో మొత్తం 480 మంది ఉపాధ్యాయులు ఓటు వేయాల్సి ఉండగా 444 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 92.50 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మునిసిపల్ కమిషనర్ పార్థసారథి, పట్టణ సీఐ కోలా రజనీకుమార్ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.



మొగల్తూరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ డి.రాజు



పెనుగొండ: భీమవరానికి తరలిస్తున్న పోలింగ్ బాక్సులు



పాలకొల్లు అర్బన్: ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు

స్వర్ణాంధ్రలో స్పేస్ టెక్నాలజీపై సెమినార్



శాస్త్రవేత్త రాజేంద్ర ధవేజీని సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: వేగంగా మారుతున్న నేటి పోటీ ప్రపంచంలో స్పేస్ టెక్నాలజీ సర్వవ్యాప్తి చెందిందని తిరువనంతపురంలోని విక్రమ్‌సారాభాయ్ స్పేస్ సెంటర్ శాస్త్రవేత్త రాజేంద్ర ధవేజీ పేర్కొన్నారు. గురువారం నరసాపురం మండలం సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్పేస్ టెక్నాలజీ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఇస్రో చరిత్ర, స్పేస్‌లో ఏ విధంగా శాటిలైట్స్‌ను ప్రవేశపెడతారో? ఎంతో అర్థవంతంగా వివరించారు. వ్యోమగాముల విధులు, వారి జీవనశైలి తదితర విషయాలను గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం రాజేంద్ర ధవేజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మందుల వితరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని కాపవరం పంచాయతీ చింతలపాలెంలో పక్షవాతంతో బాధపడుతున్న వేంద్ర సత్యవతి, నాగేశ్వరరావు దంపతులకు వాకర్స్‌క్లబ్ సభ్యులు మందులు వితరణ చేశారు. శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు రూ.7వేలు విలువైన మందులను వృద్ధ దంపతులకు అందజేశారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం

యలమంచిలి: మండలంలోని గుంపర్రు గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం షష్ఠి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ ఆలయం ఎంతో పురాతనమైంది. 16వ శతాబ్దంలో ఈ ఆలయ నిర్మించారని స్థానికులు తెలిపారు. ఇక్కడ ప్రతి ఏడాదీ మార్గశిర మాస శుద్ధ పంచమి నాడు స్వామి వారి కల్యాణం అత్యంత వైభవముగా నిర్వహిస్తారు. షష్ఠి రోజున విశేష అభిషేకాలు చేస్తారు. ఇదే రోజు భక్తులు స్వామి వారికి నాగుల చీర సమర్పిస్తారు. పంచమి నాడు సర్ప వాహనంపై, షష్ఠి నాడు నెమలి వాహనంపై, సప్తమి నాడు రథంపై, అష్టమి నాడు పల్లకిపై స్వామివారిని ఊరేగిస్తూ గ్రామోత్సవం చేస్తారు. సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి నాడు అంగరంగ వైభవంగా తీర్థం, మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నడిపూడిలో..

పెనుగొండ: నడిపూడిలో స్వయంభు వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకంలు పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 11 తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం నడిపూడి వాస్తవ్యులు మన్నే వెంకటనారాయణ కుటుంబ సభ్యులతో శైవాగమ ప్రకారం శ్రీ వల్లి దేవసేన అమ్మవార్లకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారన్నారు. . అనంతరం వివిధ సంప్రదాయ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ఉత్సవాలకు హాజరయ్యే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు.



యలమంచిలి: గుంపర్రులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం



పెనుగొండ: నడిపూడిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



వెలగలేరు పెట్రోల్ బంకు వద్ద రోడ్డు మధ్యలో గొయ్యి



వెలగలేరు మలుపులో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు (ఫైల్)



ఆలమూరు భగ్గేశ్వరం డ్రైయిన్ వంతెనపై పడిన గోతులు

- మార్టేరు–అత్తిలి ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానం
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం

పెనుమంట్ర: మార్టేరు– అత్తిలి స్టేట్ హైవే అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు, మెయింటెనెన్స్ పనులు చేయకపోవడంతో అత్తిలి నుంచి మార్టేరు వరకు 12 కిలో మీటర్ల పొడవునా అక్కడక్కడా భారీ గోతులతో దర్శనమిస్తుంది. అలాగే రోడ్డుకు ఇరువైపులా రెండు మీటర్ల వెడల్పులో మట్టితో సిల్టు ఏర్పడి మార్జిన్‌లో పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. 2000 సంవత్సరంలో మార్టేరు నుంచి పెంటపాడు వరకు 30 కిలోమీటర్ల మేర రోడ్డును స్టేట్ హైవేగా గుర్తించి ప్రపంచ బ్యాంకు నిధులతో రోడ్డును విస్తరించి గ్రామాల్లో సీసీ రోడ్డుగానూ, బయట తారురోడ్డుగాను నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. అప్పటి నుండి ఈరోడ్డులో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో మార్టేరు నుండి మంచిలి వరకు రోడ్డు అధ్వానంగా మారి వాహనదారులతో పాటు రైతులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రూ.25 కోట్లతో పునర్నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పటి ఆచంట ఎమ్మెల్యే మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో రూ. 25 కోట్లతో 12 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించారు. దీంతో వాహనదారులతో పాటు మార్టేరు నుంచి అత్తిలి వరకు సుమారు 25 వేల ఎకరాలకు చెందిన వరి రైతులకు కూడా ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరంగా మారింది. అయితే ఇటీవల ఈరోడ్డు ఇరువైపులా రెండు మీటర్ల మేర సిల్టు పేరుకుపోయి మార్జిన్‌లో పిచ్చిమొక్కలు పెరిగి ద్విచక్రవాహన ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. అంతేకాకుండా వెలగలేరు పెట్రోల్ బంకు వద్ద ఆలమూరు– భగ్గేశ్వరం డ్రెయిన్, గొంతేరు డ్రెయిన్‌ల వంతెనల సమీపంలో అక్కడక్కడా పడిన గోతులను అధికారులు పూడ్చకపోవడంతో రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై మృత్యువాత కూడా పడుతున్నారు. ఈ రోడ్డులో మార్జిన్‌కు ఇరువైపులా పేరుకుపోయిన సిల్టును తొలగించి రోడ్డుపై అక్కడక్కడా పడిన గోతులపై మరమ్మతులు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

కనీస నిర్వహణ చేయడం లేదు



వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో రోడ్డును రూ.25 కోట్లతో విస్తరించారు. స్టేట్‌హైవేగా ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారిగా ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. అయితే మూడేళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డులో మరమ్మతులు, మెయింటెనెన్స్ పనులు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. – చిర్ల వీరేశ్‌రెడ్డి, సోషల్‌వర్కర్, ఆలమూరు

త్వరలో నిర్మాణం



రోడ్ల మరమ్మతుల్లో భాగంగా ఈ రోడ్డుకు రూ.6 లక్షలు మంజూరయ్యాయి. కొద్ది రోజుల్లో మరమ్మతులు ప్రారంభిస్తాం. – ఆలపాటి యశ్వంత్, ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జ్ ఏఈ, పెనుమంట్ర

ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం

నరసాపురం రూరల్: ప్రతి రైతూ విధిగా భూసార యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించుకోవాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ డెబోరా మెస్సియానా అన్నారు. గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని మండలంలోని నవరసపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, పంటల యాజమాన్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పి.వినాయలక్ష్మి, ఏడీఏ ఈదా అనిల్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.